మగ్గం చిద్విలాసం

- చేనేత కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వైఎస్సార్ నేతన్న నేస్తంతో భరోసా
- ఏటా రూ.24 వేలు అందిస్తుండటంపై నేతన్నల హర్షం



సోమందేపల్లి: చేనేత కార్మికులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'నేతన్న నేస్తం' పథకం కింద ప్రతి ఏడాది మగ్గం ఉన్న చేనేత కార్మికుడికి నెలకు రూ.2 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24 వేలు వారి ఖాతాలకే జమ చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మగ్గాలకు ఆదరణ లేక మూలన పడేయగా.. ప్రస్తుతం మగ్గాలు మళ్లీ ఊపందుకున్నాయి. సాంప్రదాయ నేత వృత్తినే నమ్ముకున్న చేనేతలు పూర్వ వైభవం వైపు అడుగులు వేస్తున్నారు.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత పరిశ్రమపై ఆధారపడి అప్పుల పాలై ఎంతో మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కొందరైతే ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ పడరాని కష్టాలు పడ్డారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా వారు మాత్రం కనికరించలేదు.

లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.9.972 కోట్లు

2019 నాటికి పెనుకొండ నియోజకవర్గంలో 500 లోపే చేతి మగ్గాల నిర్వహణ ఉండేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు చేనేతల కోసం నేతన్న నేస్తం కింద ప్రతి ఏడాది రూ.24 వేలు ఇస్తుండటంతో ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో 2 వేలకు పైగా చేతి మగ్గాలు కార్మికులు నెలకొల్పారు. మూలన పడేసి గుజ్రీకు తరలిపోయిన చేతి మగ్గాలను తిరిగి వాటిని కార్మికులు కొనుగోలు చేసి చీరల తయారీ పై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటి వరకు గత ఐదేళ్ల కాలంలో 4155 మంది కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు చొప్పున రూ.9.972 కోట్లు వాళ్ల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

పెనుకొండ నియోజకవర్గంలో నేతన్న నేస్తం లబ్ధి ఇలా...

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం
2019-20	765	రూ.183.60 లక్షలు
2020-21	763	రూ.183.12 లక్షలు
2021-22	677	రూ.162.48 లక్షలు
2022-23	720	రూ.172.80 లక్షలు
2023-24	1230	రూ.295.20 లక్షలు

మగ్గాలకు పూర్వ వైభవం



గతంలో ఏ ప్రభుత్వం చేనేత కార్మికులకు సహాయం చేయలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ.24 వేలు ఇస్తున్నారు. దీంతో మగ్గాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిజంగానే చేతి మగ్గాలకు పూర్వ వైభవం వచ్చింది

– శీలా నారాయణస్వామి, సోమందేపల్లి

అన్నలా ఆదుకుంటున్నారు



నాకు ప్రతి ఏడాది రూ.24 వేలు నేతన్న నేస్తం పథకం కింద అందుతోంది. దీనికి తోడు పింఛన్ కూడా అందిస్తున్నారు. ఓ అన్నలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. ఆయన మేలు ఎన్నడూ మరువలేము. ప్రభుత్వ సహాయం నా కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోపడుతోంది.

– లక్ష్మీదేవమ్మ, చేనేత కార్మికురాలు

కరోనా కాలంలో ఆదుకున్నారు



కరోనా లాంటి కష్ట కాలంలో పనులు జరగక రూపాయి దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో నేతన్న నేస్తం ద్వారా ఎంతో మేలు జరిగింది. ఈ ఐదేళ్ల క్రమం తప్పకుండా నా అకౌంట్‌లోకి నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.24 వేలు జమ అవుతున్నాయి. జగనన్న రుణం మరువలేము.

– వెంకట స్వామి, సోమందేపల్లి

క్లుప్తంగా

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌స్టేషన్లతో పాటు ఇతర వివరాలను ఆయన ఏఈఆర్ ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శంకరరావు

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణంలో మార్చి 9న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు హాల్‌లో శనివారం న్యాయమూర్తులు కక్షిదారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి లోక్ అదాలత్ గురించి చర్చించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఏజీపీ భాస్కరరెడ్డి, న్యాయవాదులు శర్మ, నాగిరెడ్డి, అశ్వర్థనారాయణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా రవికుమార్



రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామానికి చెందిన ఎస్.రవికుమార్ వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సహకరించిన ఎమ్మెల్యే తిప్పేస్వామి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధారెడ్డి, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

బాడీబిల్డర్ పోటీలకు ఎంపిక



పోటీల్లో ప్రదర్శన చేస్తున్న బాడీ బిల్డర్లు

హిందూపురం: బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో కడపలో జరగనున్న రాష్ట్రస్థాయి మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల ఎంపికలు శనివారం హిందూపురంలో జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పలువురు బాడీ బిల్డర్లు ప్రదర్శన చేశారు.

విగ్రహ ధ్వంసంపై ఫిర్యాదు

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన సంఘటనపై శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బోయ నరసింహ, మున్సిపల్ వైస్ చైర్మన్ సునీల్, నాయకులు ఆళ్లగడ్డ జయశంకరరెడ్డి తదితరులు ఎస్‌ఐని కలసి ఫిర్యాదు అందించారు.

ఘనంగా ఉట్ల పరుష



ఉట్టి దగ్గర యువకుల సందడి

గుడిబండ: మండల పరిధిలోని హిరేతుర్పిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవంతో పాటు ఉట్ల పరుష వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



వంశీ

పెనుకొండ: జాతీయ సమైక్యతా శిబిరానికి పట్టణానికి చెందిన పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జర్నలిజం మూడో సంవత్సరం చదువుతున్న వంశీ ఎంపిక య్యాడు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఏపీ తరఫున శిబిరంలో పాల్గొంటారని ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు.

ఖైదీల ఆరోగ్యంపై దృష్టి సారించండి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి శైలజ

హిందూపురం అర్బన్: సబ్ జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ వైద్యాధికారి ఆనంద్‌కు సూచించారు. శనివారం ఆమె సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం జైలులో ఎంత మంది ఖైదీలు ఉన్నారు? ఏ ఏ కేసుల్లో నిందితులు అన్న వివరాలను సబ్‌జైలు అధికారి అంజినాయక్‌తో అడిగి తెలుసుకున్నారు. బెయిల్ రాని నిందితులు ఎవరైనా ఉంటే తెలియజేయాలన్నారు. జైలు గదులను పరిశీలించి ఖైదీలతో నేరుగా జైలులో అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలులో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సేవలు అందించాలన్నారు.

అర్జీదారులతో..

అదనపు జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించి జిల్లా అదనపు జడ్జి శైలజ అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో న్యాయవాదులు సుదర్శన్, నాగరాజురెడ్డి, నవేరా, పార్వతి, రవికుమార్, గోపాల్, హేమావతి పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు రేపు

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో సోమవారం ఉదయం 10.30 గంటలకు వలంటీర్లకు పురస్కారాలు అందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి అతిథిగా హాజరై వలంటీర్లకు పురస్కారాలు అందిస్తారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్. దీపిక అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేసి పనులు ప్రారంభింపజేశారు. 28వ వార్డు కోట పరిధిలోని ఓల్డ్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కౌన్సిలర్ మల్లికార్జున ఆధ్వర్యంలో రూ.4.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఆర్చ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే 27వ వార్డు పాండురంగనగర్ 2వ క్రాస్‌లో కౌన్సిలర్ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ అన్నివార్డుల్లో అవసరమైన మౌళిక సదుపాయలు కల్పించడంతో పాటు హిందూపురాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. మండలాల్లో కూడా రహదారులు, గ్రామాల్లో ప్రజావసర పనులు దశలవారీగా చేపడతామన్నారు.



ఆర్చ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

మరో రెండేళ్లలో అన్నిరంగాల్లో హిందూపురం నియోజకవర్గాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రజలు కట్టంకట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు రోషన్ అలీ, రహమత్ బీ, పట్టణ క్లస్టర్ 1 కన్వీనర్ మన్సూర్, పట్టణ ఏబ్లాక్ మైనార్టీ కన్వీనర్ అయుబ్ భేగ్, మహిళా విభాగం కన్వీనర్ భాను, ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్, వార్డు ఇన్‌చార్జిలు డిష్ చాంద్ బాషా, దాదు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి

హిందూపురం టౌన్: విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను అందించుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాలలో 'ఫ్యూజన్ విజన్ ఫెయిర్-2024'ను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ, పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రయోగాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రయాన్-3 ప్రయోగం గురించి వివరిస్తున్న విద్యార్థులు

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రైలులో నుంచి కింద పడి మృతి చెందిన అనాథ వ్యక్తి మృతదేహానికి 'విజన్ ఇన్‌కో ఫౌండేషన్' ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం రైల్వేట్రాక్‌పై లభించిన మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినప్పటికీ మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో రైల్వే పోలీసులు సమాచారాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌కు తెలియజేశారు. ఆయన విజన్ ఇన్‌కో ఫౌండేషన్ వారికి తెలియజేశారు. ఫౌండేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, అఖిల్, రమణారెడ్డి, నిఖిల్, రైల్వే పోలీస్ కిరణ్ సహకారంతో మోతుకుపల్లిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఏపీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న మహేష్‌బాబు

పరిగి: ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ టెస్టు 2024 మెయిన్స్‌లో మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి ఎం మహేష్‌బాబు జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. విద్యార్థుల్లో మేధాశక్తిని వెలికి తీసేందుకు ప్రముఖ ఎడ్యుకేషనల్ ఎపిఫనీ అనే ఎన్జీఓ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మహేష్‌బాబు జిల్లా ప్రథమ స్థానంలో రాణించాడన్నారు. అలాగే మునీంద్ర అనే విద్యార్థికి మండల స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. వారికి శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మెమొంటో, ప్రశంసా పత్రాలతో పాటూ రూ.8 వేల క్యాష్ ప్రైజును అందుకున్నారన్నారు.

శేష వాహనంపై పేట వేంకటరమణుడు

హిందూపురం: పట్టణంలోని మెయిన్ బజారులోని పేట వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, తిరుమంజన సేవ, ప్రాకారోత్సవం చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణతో పూజలు జరిగాయి. తర్వాత ఉత్సవ మూర్తులను శేష వాహనంపై కొలువుదీర్చి పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భగీరథ నవీన్ , ఈఓ నరసింహమూర్తి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



అలంకరణలో పేట వెంకటరమణస్వామి

'సిద్ధం' సభను విజయవంతం చేయాలి

మడకశిర: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. రెండోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాప్తాడు వద్ద ఆదివారం జరిగే సిద్ధం సభను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. మడకశిర నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ సభకు తరలి రావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. మడకశిర నియోజకవర్గంలో కూడా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తామన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ ఉండదని తెలిపారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, అమరాపురం జెడ్పీటీసీ నరసింహమూర్తి, ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, ఈరన్న,రాధమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు రామిరెడ్డి, చంద్రశేఖర్, మోతీరామ్, డైరెక్టర్లు చంద్రప్ప, నాగన్న, జేసీఎస్ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, శివకుమార్, విక్రమ్, నాగేంద్రయాదవ్, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసినంత ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి మరే ముఖ్యమంత్రి చేయలేకపోయారని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ తెలిపారు. శనివారం స్థానిక టీచర్స్‌కాలనీ వద్ద ఆగ్రోస్ చైర్మన్ ఆఫీసు వద్ద నవీన్‌నిశ్చల్ మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా ఎన్నికల శంఖారావం పూరించడానికి 18న రాప్తాడు సిద్ధం బహిరంగ సభకు సీఎం జగన్ విచ్చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి సిద్ధం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి రాబోయే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటున్నాయని చెప్పారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. రాప్తాడులో జరిగే సిద్ధం సభకు హిందూపురం నియోజకవర్గం నుంచి దాదాపు 10 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీరు, భోజన వసతి ఏర్పాట్లు కూడా చేసినట్లు వివరించారు.



మడకశిర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: మాట్లాడుతున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

మడకశిర: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాప్తాడు వద్ద ఆదివారం జరగనున్న సిద్ధం సభకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో 76 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయని, ఒక్కో సచివాలయం నుంచి రెండు బస్సుల్లో తరలివెళ్లడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

పెనుకొండ: రాప్తాడులో ఆదివారం జరిగే సిద్ధం మహాసభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు ఉదయమే బయలుదేరాలని కోరారు.

గోరంట్ల: రాప్తాడులో ఆదివారం జరగనున్న సిద్ధం సభకు మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు గోరంట్ల మండలం నుంచి బస్సులు బయలు దేరతాయన్నారు.

అమరాపురం/రొళ్ల/అగళి/మడకశిర రూరల్: రాప్తాడు వద్ద ఆదివారం నిర్వహించే సిద్ధం సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, అగళి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి 170 బస్సుల్లో రాప్తాడుకు బయలుదేరి వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే సహించం

హిందూపురం: 'రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీర అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదు. మరోసారి కించ పరిచేలా మాట్లాడితే ఉపేక్షించేదిలేదు' అని హిందూపురం నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి విమర్శించారు. శనివారం హిందూపురం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎప్పుడో పాడెక్కిందన్నారు. ఆస్తులు లేవు.. రెండు ఆవులు, గేదెలు ఉన్నాయని ఎన్నో సార్లు చెప్పిన రఘువీరకు.. వందల కోట్ల రూపాయలు, ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జగనన్నను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, ఇప్పుడు కుటిల రాజకీయాలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయని అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, ఆర్‌కె.ఖలీల్, వైస్ చైర్మన్ మహేందర్‌నాథ్‌రెడ్డి, నక్కలపల్లి శ్రీరామ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, కౌన్సిలర్లు శివ, గిరి, నాయకులు నాగరాజు, నవీన్, రవీంద్రారెడ్డి, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

రఘువీరాకు రాజకీయ లబ్ధే ముఖ్యం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి



మడకశిర: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి మానుకోవాలని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శనివారం మడకశిరలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డిపై రఘువీరారెడ్డి చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రఘువీరారెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే వైఎస్సార్ కుటుంబమని, అలాంటి కుటుంబంపైనే రాజకీయ లబ్ధికోసం కుట్ర చేసిన వ్యక్తి రఘువీరారెడ్డి అని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎప్పుడూ వైఎస్ఆర్ కుటుంబం వెంటే ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీని దెబ్బ తీయడానికి చంద్రబాబుతో కాంగ్రెస్ లాలూచీ పడడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం సమైక్యాంధ్ర ఉద్యమానికి రఘువీర తూట్లు పొడిచారని మండిపడ్డారు. రఘువీరారెడ్డి సమైక్యాంధ్ర ఉద్యమానికి ఎప్పుడూ మద్దతు పలికిన పాపాన పోలేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా బలంతో మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని ఆయన స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ నియామకం

హిందూపురం: వైఎస్సార్‌సీపీ హిందూపురం మండల నూతన కమిటీని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ హిందూపురం మండల అధ్యక్షుడిగా సి.రాము, ఉపాధ్యక్షుడిగా జి.నాగభూషణరెడ్డి, బి.కిషన్‌కుమార్‌ను నియమించారు. అలాగే జనరల్ సెక్రటరీలుగా షేక్‌మన్సూర్, రంగయ్య, ఎస్.రామాంజి, కార్యదర్శులుగా కె.బాలశివారెడ్డి, కె,రంగనాథ్, ఏ.శేఖర్, ఎం.మధుసూదన్‌రెడ్డి, వై.షఫీకుమార్‌రెడ్డి, తిప్పన్నను ఎంపిక చేశారు. కోశాధికారిగా జి.సుబ్బిరెడ్డి, ఈసీ సభ్యులు మంజునాథ్, ప్రభాకర్, బి.అశ్వర్థప్ప, జి.గోపాల్, జె.అంజినప్ప, బి.రమణ, ఎం.నాగరాజు, హయత్‌బాష, కె.ఈశ్వర్, రాజారెడ్డి, ఆదినారాయణ, కె.ఎన్.సిద్దారెడ్డి, టి.ప్రసన్న, కె.రవిమోహన్‌రెడ్డిలను నియమించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి తెలిపారు. శనివారం హరేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. బాలికల జట్టు క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న సందర్భంగా హెచ్ఎం సునీత, పీఈటీ చరణ్‌ను సన్మానించి క్రీడాకారులను అభినందించారు.